మనం ఏపని చేస్తున్నాము, ఏమి మాట్లాడుతున్నాము అనేది ముఖ్యం కాదు. ఆ పని చేసేటప్పడు మనం హృదయంలో ఎలా ఉన్నాము అనేది ముఖ్యం. మీ శరీరం ఎంతో కాలం ఉండదు, అది కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. మీరు ఏమయినా మంచి పనులు చేస్తే నదులు ఎంత కాలం అయితే ప్రవహిస్తాయో, పంచభూతాలు ఎంతకాలం అయితే ఉంటాయో, సూర్యచంద్రులు ఎంతకాలం అయితే ఉంటారో మీరు సహృదయంతో చేసిన పనులు కూడా అంతకాలం నిలబడి ఉంటాయి. దేశబంధు ఈజ్ డెడ్, లాంగ్ లివ్ దేశబంధు అన్నారు గాంధీజీ. దేశబంధుకు సఫరింగ్ ఉంది, శాక్రిఫైస్ ఉంది. వాటిని గుర్తు పెట్టుకొని బాపూజీ ఏమన్నారంటే దేశబంధు చనిపోయాడు కాని చిరకాలం జీవించుగాక అన్నారు. అంటే ఆయన శరీరం చనిపోయింది కాని ఆయన మన హృదయంలో సజీవంగా ఉంటాడు అని చెప్పటం. మనం అందరం జీవించి ఉండగానే చనిపోతున్నాము కాని వాళ్ళు చనిపోయినా మన హృదయంలో సజీవంగా ఉన్నారు.

ధనం హద్దులు లేకుండా పెరిగిపోతే ఆ ధనమే మనకు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మనకు ధనం ఉండవచ్చు, చదువు ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు కాని మానవతా దృక్పథం విడిచిపెట్టకండి. మన చుట్టూ సమాజం ఉందని మరిచిపోవద్దు. వాళ్ళకోసం వాళ్ళు జీవించేవారు ఎక్కువమంది ఉంటారు, ఇతరుల కోసం జీవించేవాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. దాసుగారు ఇతరులకోసం జీవించారు కాబట్టే ఆయనను దేశబంధు ఈజ్ డెడ్, లాంగ్‌లివ్ దేశబంధు అన్నారు. అలాగే తిలక్ గారికి కూడా శాక్రిఫైస్ ఉంది, సఫరింగ్ ఉంది. దేశం కోసం కష్టపడి పనిచేసి ఏమీ ఆశించకుండా, వారసత్వాలు లేకుండా వెళ్ళిపోయినవారు కొద్దిమంది ఉన్నారు, వారు భగవంతుడియొక్క అనుగ్రహానికి పాత్రులవుతారు. గాడ్ హేజ్ క్రియేటెడ్ సమ్ సోల్స్ టు లివ్‌ఫర్ అదర్స్ ఓన్లీ. అంటే హృదయపూర్వకంగా ఇతరులకోసం జీవించే వాళ్ళు కొంతమంది ఉంటారు. అటువంటి వారిలో లోకమాన్యుడు ఒకడు. మీరు రోజూ చేసుకొనే పని మానకూడదు. మీరు చెయ్యకూడని పని చెయ్యటం ఎంత దోషమో, రోజూ చేసుకొనే పని మానెయ్యటం కూడా అంతే దోషం. ఏది విధి, ఏది నిషేధం ఇవన్నీ స్మృతిలో చెపుతాడు.

రామకృష్ణుడికి యింకో పది నిమిషాలలో ప్రాణం పోతుంది అనగా నరేన్‌కు అనుమానం వచ్చింది. వీడికి కేన్సర్ వచ్చింది, దగ్గుతున్నాడు, వీడు అసలు అవతార

పురుషుడేనా అని నరేన్‌కు అనుమానం వస్తోంది. నరేంద్రుడు అలా అనుమానిస్తు ఉంటే అప్పుడు రామకృష్ణుడు అంటాడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో నీకుఏమి తెలుస్తుంది నరేన్ ఎవడయితే రాముడో ఎవడయితే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అని చెప్పాడు. అయితే కేన్సర్ రావటం అనేది ఆ దేహ ప్రారబ్దం. మరి కృష్ణుడి దేహప్రారబ్దం చూడండి. వేలాది యుద్ధాలు చేసినా కృష్ణుడు చిన్నబాణం దెబ్బతో శరీరం విడిచిపెట్టేసాడు. శరీరం విడిచిపెట్టేయటానికి ఏదో ఒక వంపు అంతే. మనం మాటల దగ్గర బహుజాగ్రత్తగా ఉండాలి. ఒకోసారి మనం మాట్లాడిన మాటలే మనలను బలి తీసుకుంటాయి. కాలు జారితే తీసుకోగలం కాని మాట జారితే తీసుకోలేము. వాక్కు తపస్సు, శారీరక తపస్సు, మానసిక తపస్సు ఈ మూడు లేకుండా మీరు పవిత్రులు అవ్వలేరు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనం చెడ్డమాటలు మాట్లాడితే దానివలన మనకే చెడ్డ వస్తుంది అన్నవాడు చెడ్డవాడు అవుతాడు కాని పడ్డవాడు చెడ్డవాడు అవ్వడు. మీరు ఏదయినా పొరపాటు మాట్లాడితే, పొరపాటు పనులు చేస్తే దానిని రిపీట్ చేయవద్దు. జీవితంలో మీరు ఏదయినా పొరపాటు మాటలు మాట్లాడి ఉండవచ్చు, వాటిని రిపీట్ చేయకండి. మీరు అలా రోజూ పొరపాటు మాటలే మాట్లాడుతూ ఉంటే, రోజూ పొరపాటు పనులు చేస్తూ ఉంటే మీ సమాధులు ఎవరూ కట్టనక్కరలేదు, మీ సమాధులు మీరే కట్టేసుకొంటారు అన్నాడు మిల్టన్. ఎప్పుడైనా మీ నోటినుండి పొరపాటు మాట రావచ్చు, అయామ్ సారీ అని చెప్పేస్తే సరిపోతుంది. అలాకాకుండా ఆ మాటనే రిపీట్ చేస్తూ ఉంటే, దానిని సవరించుకోలేకపోతే బతికిఉండగానే నీ సమాధిని నువ్వే కట్టుకొంటున్నావు. మీరు చనిపోయాక మీ సమాధులు ఎవరూ కట్టనక్కరలేదు.

మీకు నాలెడ్జ్ ఉంది అనుకోండి, మీరు స్వతంత్రంగా ఆలోచించుకోగలగాలి. నేను ఏదో మాట్లాడుతున్నాను, మీరు వింటున్నారు. ఇందులో లోపలకు తీసుకోవలసిన మాటలు ఎన్ని ఉన్నాయి, విసర్జించవలసిన మాటలు ఎన్ని ఉన్నాయి అని మీరు స్వతంత్రంగా ఆలోచించుకోవాలి. అలా ఆలోచించుకోవటానికి మీ నాలెడ్జ్ మీకు సహకరించాలి. అంతేగాని మీ తలకాయలను అమ్ముకోవద్దు. మీ తలకాయను ఎక్కడైనా అమ్ముకొంటే ఇంక మీరు స్వతంత్రంగా ఆలోచించుకోలేరు. మీరు ఏదైనా మాట్లాడుతూ ఉంటే అందులో మెస్సేజ్ ఉండాలి. మీ హృదయంలో ఎక్కడైతే నిజం ఉందో మీ మాట అక్కడ నుండి

పొంగిరావాలి. అంటే మీరు మాట్లాడేది హృదయపూర్వకంగా ఉండాలి. ఇప్పుడు మీ నాలుక నోట్లో ఉంది కాని ఆచార్యుడి నాలుక హృదయంలో ఉంటుంది. మీ బిహేవియర్ ఎలా ఉండాలి అంటే మీరు పూర్ణస్థితిని పొందటానికి అనుకూలంగా ఉండాలి. పెర్‌ఫెక్షన్ వేరు, ఎంజాయ్‌మెంట్ వేరు. పాలకొల్లుకు నరసాపురం ఒక ప్రక్కన ఉంది, దొడ్డిపట్ల ఒకప్రక్కన ఉంది. దొడ్డిపట్ల రూటుకు, నరసాపురం రూటుకు సంబంధం లేదు. అలాగే పర్‌ఫెక్షన్‌కు వెళ్ళే దారి వేరు, ఎంజాయ్‌మెంట్‌కు వెళ్ళే దారి వేరు. మీ జీవిత గమ్యం పూర్ణస్థితిని పొందటం కాని ఎంజాయ్‌మెంట్ కాదు. జీవితంలో భోగాలు అనుభవించి చనిపోతే మరణానంతరం చెడ్డలోకాలు వస్తాయి. నువ్వు ఎంజాయ్‌మెంట్స్‌కు వెళ్ళిపోతే ఇంక నీకు పెర్‌ఫెక్షన్ దొరకదు. నువ్వు భోగాలు అనుభవిస్తూ పోతే పరిణామంలో ఈ భోగాలు అన్నీ కూడా రోగాలుగా మారిపోతాయి, అవి నీకు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఎంజాయ్‌మెంట్స్ వలన పునర్జన్మలు వస్తాయి. భోగాలు అనుభవించాలి అంటే శరీరం ఉండాలి కదా అందుచేత పునర్జన్మ వస్తుంది. పూర్ణస్థితిని పొందటంకోసం మీరు విశ్రాంతి లేకుండా ప్రయత్నం చేయండి. పూర్ణస్థితిని పొందటానికి మీ మనస్సును, మీ ఇంద్రియాలను అంతర్ముఖం చెయ్యాలి. ఇంద్రియాలు అంతర్ముఖం అవ్వకపోతే ప్లెజర్స్‌కోసం అవి బయట తిరుగుతూ ఉంటాయి.

మీరు ఏదైనా ఒక పని చేసినా ఆ పని ఎందుకు చేసారు అంటే దానికి ఒక రీజన్ ఉండాలి. రీజన్‌ను విడిచిపెట్టవద్దు. మీ జీవితంలో రీజన్ అనేది ఎంతవరకు తీసుకొనివెళితే అంతవరకు వెళ్ళండి. అది రీజన్‌కు అందకపోతే అప్పుడు విశ్వాసం. మీరు పనిచేసే కార్యరంగం విశాలమవుతూ ఉండాలి, మీ మనస్సు విశాలమవుతూ ఉండాలి. మీకు ఎవరో కొంతమంది బంధువులు ఉంటారు కాని దాసుగారికి దేశం అంతా బంధువులే. అందుచేతనే ఆయన దేశబంధు. మీ శరీరాలకు తల్లితండ్రులు వేరు వేరుగా ఉండవచ్చు కాని లోపల ఉన్న జీవుడికి ఈశ్వరుడే తండ్రి. ఈ జీవుడు ఈశ్వర అంశే. ఊరికే శరీరాన్ని తొడుక్కొన్నాడు. అంటే జీవుడు వేరు, శరీరం వేరు. అందుచేత ఏదోరోజున శరీరాన్ని విడిచిపెట్టేస్తున్నాడు. పూజలు, జపాలు గొడవ వద్దు. ఐయామ్ నేను ఉన్నాను దానితోటి తాదాత్మ్యం పొందండి. ఆ ఉండటం అనేదానికి శరీరంతో సంబంధం లేదు, లోకంతో సంబంధం లేదు. శరీరం కాలి బూడిద అయిపోయినా ఆ ఉండటం అనేది కంటిన్యూ అవుతుంది. ఉన్నాను, అది నేనై ఉన్నాను అని బైబిలులో చెప్పాడు. మనకు అది కూడా వద్దు. ఉన్నాను, ఆ ఉండటం అనేది

మనకు అనుభవంలోనికి రావాలి. అది అనుభవంలోనికి వస్తే మనకు మరణభయం పోతుంది. అన్నింటికంటే పెద్ద భయం ఏమిటి అంటే అది మరణ భయం. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ఆ దేహంపోతే మనం పోతాము అనుకొంటున్నాము, దాని వలన భయం వస్తోంది. శరీరం పోయినా మనం ఉంటాము అనేది మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక మరణ భయం పోతుంది. మీకు చదువులేదు, ఈ చదువుకొన్నవాళ్ళ విలువ మీకు తెలియటంలేదు అని రామకృష్ణుడితో అనేవారు. అవును వీళ్ళు చదువుకొన్నమాట నిజమే కాని వాళ్ళ తోకలు ఏమైనా తెగినాయా? దాని అర్థం ఏమిటి అంటే దేహబుద్ధి అనేది ఒక తోక. ఆ తోక ఎవరికైనా తెగిందా? ఆ తోక తెగకపోతే నాన్‌సెన్స్ అంతా ఉన్నట్లే. చదువు వలన పొట్ట వెళ్ళిపోతుంది. చదువుకొన్నంతమాత్రంచేత మూర్ఖత్వం పోతుందా? వారికి శవబుద్ధి ఏమైనా పోయిందా? శవబుద్ధి పోయినప్పుడు కదా నీకు శివబుద్ధి కలిగేది. శవబుద్ధి పోకుండా శివబుద్ధి ఎలా కలుగుతుంది?

ఆచార్యుడు చెప్పిన మాటలను నువ్వు బాగా జీర్ణం చేసుకోవాలి. ఏ పని చెయ్యటం వలన నువ్వు బంధింపబడతావో, ఏ పని చేయటం వలన నీకు ఎటాచ్‌మెంట్ వస్తుందో వాటికి దూరంగా ఉండు. డ్యూటీ వేరు, ఎటాచ్‌మెంట్ వేరు. రామకృష్ణుడు చెప్పిన కథను మీరందరు జ్ఞాపకం పెట్టుకోవాలి. మీ ఇంట్లో పనిమనుషులు ఎలా ఉంటారో మీరు అలాగే ఉండాలి. మీ ఇంట్లో పనిమనుషులు మీ పిల్లలను ఎత్తుకొంటారు, మీ పనులు అన్నీ చేసిపెడతారు కాని వీళ్ళెవరు నావాళ్ళుకాదు అని వారికి తెలుసు. మీ కుటుంబ సభ్యులపట్ల కూడా నువ్వు అలాగే ఉండాలి. వారిపట్ల నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి అంతేగాని బంధం పెట్టుకోవద్దు. ఎవరూ ఎవరికీ ఏమీకారు. ఆచార్యులు చెప్పిన మాటలను వినేసి, దులుపుకొని వెళ్ళిపోవటంకాదు, ఆ మాటలను మీరు జీర్ణం చేసుకోవాలి. భగవాన్ దగ్గర ఈ మాట వచ్చింది. ఏమండీ మీరు బాగానే చెపుతున్నారు కాని మాకు జీర్ణం అవ్వటంలేదు అని భగవాన్‌తో అంటే వాసనల వేగం అంతబలీయంగా ఉన్నది, ఏమి చేసేది అనేవారు. మీరు పూర్వజన్మలలో చేసిన పనులు వాసనకింద పడుతుంది. ఆ వాసనలు మిమ్మల్ని వెంటాడతాయి. నేను చెప్పిన మాటలను అవి మీకు అర్థం కానివ్వవు, ఈ మాటలను మింగనివ్వవు. పైగా ఈ మాటలు అబద్ధం అని కూడా మీకు అనిపిస్తాయి. వాసనలు అంతబలీయంగా ఉన్నాయి ఏమి చేయగలము అని అంటారు కాని ఆ వాసనలను

తగ్గించటానికి చూస్తారు. పైకి అలా మాట్లాడినా కాని ఆ వాసనలను బర్న్ చేయటానికి చూస్తారు. మనలో ఉన్న వాసనలను కాల్చి బూడిద చేసేవాడే గురువు. నేను చెప్పిన మాటలను ఆ వాసన రిజక్ట్ చేస్తుంది. ఏ వాసన వల్ల మీకు ఆ టీచింగు అర్థమవ్వటంలేదో ఆ వాసనను బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు, వాడే గురువు.

ఆచార్యుడు అంటే నువ్వు ఏదైతే బోధిస్తున్నావో దాని తాలూకు అనుభవం నీకు ఉండాలి. నువ్వు ఏదైతే అనుభవిస్తున్నావో అది నువ్వు చెప్పగలగాలి అంటే నీ ఎక్స్‌పీరియన్స్‌ను ఎక్స్‌ప్రెషన్‌లోనికి తీసుకొనిరావాలి. అంతేకాదు వినేవాడిపట్ల ఆప్యాయత ఉండాలి. తల్లికి బిడ్డ మీద ఎంత ప్రేమ ఉంటుందో టీచర్‌కు అంత ఆత్మీయత, ప్రేమ ఉండాలి. తల్లి బిడ్డ యొక్క శ్రేయస్సు ఎలా కోరుకుంటుందో అలాగ వినేవాడి భవిష్యత్ క్షేమం కోరుకోవాలి. వాడికి అర్థంకాకపోతే అర్థమయ్యేలాగ చెప్పగలగాలి. నాకెందుకు అని ఊరుకోకూడదు. వినేవాడి స్థాయికి దిగి చెప్పాలి. చెప్పినా అర్థం కావటం లేదు అని వదిలేయకూడదు. వాడికి అర్థమయ్యేవరకు రిపీటెడ్‌గా చెప్పగలగాలి. నువ్వు అలా ఉంటేనే ఆచార్యుడిగా ఉండు లేకపోతే వద్దు. మన లోపల చైతన్యాన్ని, జడాన్ని కలిపే గ్రంధి ఒకటి ఉంటుంది. ఆ గ్రంధి ఏమి చేస్తుంది అంటే ఈ దేహం మీరు కాకపోయిన అదే మీరు అనే బుద్ధిని కలుగజేస్తుంది. మీ స్వరూపం పుట్టుక లేనిది, చావు లేనిది అయినా మనం పుడుతున్నాము, చనిపోతున్నాము అనుకొంటున్నాము కదా! అలా అనుకోవటానికి ఈ గ్రంధే కారణం. దానిని ఛిజ్జడగ్రంధి అంటారు. అది మన శరీరంలో ఒక భాగం కాదు. దానిని సర్జరీ చేసి తీసేయటానికి అవకాశం లేదు. అది చైతన్యాన్ని కలుపుతుంది. ఆ గ్రంధిని నువ్వు ఎలిమినేట్ చెయ్యాలి. మనం ఇమీడియట్‌గా చేయవలసిన పని అదే. మిగతా పనులు అన్నీ వాయిదా వేసుకోండి. మనం వెంటనే ఆ గ్రంధిని కట్ చేయాలి. మీరు ఆపనిని చేయగలరా? అది వివేకవంతులకే సాధ్యం. ఈ గ్రంధిని కట్ చేయటం అనేది మనం ఇమీడియట్‌గా చెయ్యాలి. మనం వెంటనే కనుక చెయ్యకపోతే ఈలోపుగా ఈ శరీరానికి చావు వచ్చేస్తుంది, మరల పునర్జన్మ వచ్చేస్తుంది. అందుచేత మిగతా పనులు తరువాత చేసుకోవచ్చు ముందు ఈ గ్రంధిని కట్ చెయ్యి. మీరు ఇమీడియట్‌గా చెయ్యవలసిన పనిని మర్చిపోవద్దు. రేపు పెళ్ళి అనగా మనం ఏ పనులు చేస్తాము. పెళ్ళి పనులు మాత్రమే చేసుకొంటాము, మిగతా పనులు అన్నీ వాయిదా వేస్తాము. అలాగే ఇప్పడు మనకు శరీరం వచ్చింది. ఏ పని చేస్తే

మరల శరీరాలు రాకుండా ఉంటాయో ఆ పనిని ముందుగా చేసుకోండి, మిగతాపనులు తరువాత చూసుకోవచ్చు. అంటే ఈ ఛిజ్జడగ్రంధిని కట్ చెయ్యండి. వివేకవంతులు, వైరాగ్యవంతులు ఆ నాడిని కట్‌చెయ్యగలరు కాబట్టి మీరు వివేకవంతులుగా జీవించండి, వైరాగ్యంగా జీవించండి. ఆ నాడిని కట్ చెయ్యటానికి ఆచార్యుడు మనకు సహకరిస్తాడు. అందుచేత ఆచార్యుడు మనకు ముఖ్యం. ఆచార్యుడిపట్ల గౌరవంగా ఉండటం కూడా చాలా ముఖ్యం.

మనం వ్యవహారానికి ఏమంటున్నాము అంటే మనకు ఏదైనా తెలిస్తే జ్ఞానం అంటున్నాము, తెలియకపోతే అజ్ఞానం అంటున్నాము. నాకు తెలుసును అని ఎవరు చెపుతున్నారు, మనస్సే చెపుతోంది. దానిని జ్ఞానం అంటున్నాము. నాకు తెలియదు అని ఎవరు చెపుతున్నారు, అదీ మనస్సే చెపుతోంది, దానిని అజ్ఞానం అంటున్నాము. మనం అనుకొనే తెలుసును, తెలియదు, జ్ఞానం, అజ్ఞానం ఈ మాటలకు లోపలఉన్న సత్యానికి ఏమీ సంబంధం లేదు. మేము అలా ఉన్నాము, మేము ఇలా ఉన్నాము అని కూడా అనుకోవద్దు. మేము మంచివాళ్లము, మేము చెడ్డవాళ్లము అని అనుకోవద్దు. మేము ధనవంతులము, మేము పేదవారము అని అనుకోవద్దు. మీ గురించి మీరు ఏమీ అనుకోవద్దు. ఇలా మీ గురించి మీరు ఏదో ఒకటి అనుకోవటం వల్లనే లోపల ఉన్న సత్యం మీకు తెలియకుండా ఇదే అడ్డువస్తోంది. మీ గురించి మీరు ఏదో ఒకటి అనుకొంటారుకదా! అలా అనుకోవటం మానేయండి. మీ గురించి మీరు ఏమీ అనుకోవద్దు. అలా క్వయిట్‌గా, కామ్‌గా ఉండండి. మీరు శరీరంగా ఉండవద్దు, మీరు మనస్సుగా ఉండవద్దు. మీరు అలాగ ఉండవద్దు, ఇలాగ ఉండవద్దు ఇవన్నీ తలంపులే. ఈ తలంపులే లోపల ఉన్న వస్తువుకు మనలను దూరం చేస్తున్నాయి. మేము ధనవంతులం అనేది ఒక తలంపు. మీకు ధనం ఉంది అనుకోండి, ఎంతకాలం ఉంటుంది, మహా సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకొనిపోయాయి కదా! ఎందుకు ఆ ధనం చూసుకొని అలా మురిసిపోతారు? మురిసిపోవటానికి ఏముందీ ఈ లోకంలో? ఈవెన్ దిస్ సోల్ పాస్ ఎవే. కాలప్రవాహంలో ప్రతీదీ కొట్టుకొనిపోతుంది. మన శరీరమే కాలప్రవాహంలో కొట్టుకొనిపోతోంది కదా! ఈ లోకంలో ఏముంది మీరు గర్వపడటానికి? మీ ఆయన మంచివాడు అనుకోండి, ఉంటే అలా ఉండనివ్వండి. వాడిని మంచివాడిలాగే ఉండనివ్వండి. వాడు మంచివాడు అని

మీకు గర్వం ఎందుకు? మా ఆయన మంచివాడు, మా ఆయన మంచివాడు అని ఆ గోల ఏమిటి? ఆ గొడవ మీకు ఎందుకు? వాడు బయట ఉన్నాడా? లోపల ఉన్నాడా? అన్నీ బయటే ఉన్నాయి. ఆ గొడవలు అన్నీ నెత్తిమీద వేసుకొని తిరుగుతారు ఏమిటి? అసలు మీరు గర్వపడటానికి ఈ సృష్టిలో ఏముంది? దేనిని చూసి మీరు మురిసిపోతున్నారు? ఇక్కడ చాలామంది మన కళ్లకు కనిపిస్తున్నారు. ఇంకో 50 సంవత్సరాల తరువాత చూస్తే ఇందులో ఒక్కడూ కనిపించడు. తామరాకుమీద నీటిబొట్టు ఎంతసేపు ఉంటుంది? అలాగే మన వయస్సు కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది.

మీరు చెప్పేది మాకు తెలియటంలేదు అని భగవాన్‌తో అంటే ఏమి చేస్తాము మీ వాసనల వేగం అలా ఉంది, మీ అలవాట్లు అలా ఉన్నాయి. ఈ అలవాట్లు ఎక్కడ నుండి వస్తున్నాయి. పూర్వజన్మల నుండి వస్తున్నాయి. అవి లోతుగా ఉన్నాయి, ఒక్కసారిగా పొమ్మంటే అవి పోతాయా? ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే గోడలో ఏదైనా మేకు కొట్టాము అనుకోండి, అది ఎంత బలంగా కొడితే మరల అంత బలంగా ఆ మేకును తీయాలి. అలాగే నీకు అలవాటు ఎంత లోతుగా ఉందో అంత గట్టిగా దానిని పెకిలించాలి గాని అది తేలికగా రాదు. దానికి నీ ప్రయత్నం ఒక్కటే సరిపోదు. దానికి గురువు అనుగ్రహం కూడా ఉండాలి. జనన మరణ ప్రవాహానికి కారణమైన ముడిని ముందు కట్‌చెయ్యాలి. ఆలస్యం చేయవద్దు. ముందుగా ఆ పని చెయ్యండి. దానిలో నుండి మీరు విడుదల పొందాలి అంటే మీకు సత్యజ్ఞానం ఉండాలి. సత్యజ్ఞానానికి అనుగుణంగా మీ జీవిత విధానం ఉండాలి. అంటే మీ హృదయం, మాట, చేత ఒకటిగా ఉండాలి. అంటే మీ హృదయంలో ఏదైతే ఉందో అదే మాట్లాడాలి, మీరు ఏదైతే మాట్లాడుతున్నారో అదే చేత్తోటి చెయ్యాలి. మీరు లోపల ఎలా ఉన్నారో యాక్షన్ కూడా అలాగే ఉండాలి. గాంధీజీని మెసేజ్ ఇవ్వమని ఒక విలేకరి అడిగాడు. "ప్రత్యేకంగా మెసేజ్ ఏముంది? నా జీవితమే మెసేజ్. నేను ఎలా జీవిస్తున్నానో మీరు చూస్తున్నారు కదా, అదే మెసేజ్. ఇంక ప్రత్యేకంగా నేను చెప్పేది ఏమీ లేదు" అన్నారు. ఇవి ఇమ్మోర్టల్ వర్డ్స్. మై లైఫ్ ఈజ్ మై మెసేజ్. ఇంక నోటితో చెప్పటం ఎందుకు? భగవాన్ ఎక్కువగా మాటలు చెప్పరు, చాలా తక్కువగా మాట్లాడతారు. అంటే చేసేటప్పుడు చెప్పటం ఎందుకు?

# పనికిరాని పరితాపాలను పరిహాశ్యం చెయ్యాలి

మనంతట మనకు కలిగే పనికిమాలిన భావాలు చెత్త అని ఆ విషయభావాలు మనలను పట్టుకోలేదు. మనమే ఆ చెత్తను పట్టుకొన్నాము. దానికి మనపై ఆసక్తిలేదు, గౌరవంలేదు అది జడం. దాన్ని వదిలేస్తే మనకు ఏ ఇబ్బందిలేదు. అది మనలను ఎందుకు వదిలిపెడుతున్నావు అని అడగదు. అది మన దగ్గరనుంచే శక్తిని స్వాతంత్ర్యాన్ని పొందింది. మనం వాటిని పట్టుకొని వేళ్ళాడుతున్నాము ఆ విషయాలు విలువైనదని నమ్ముతున్నాము. శ్రీనాన్నగారు "విషయవికారాలను చూడకండి. బుద్ధిలోని దోషాలను తెలుసుకొని, పవిత్రుడివికా. అప్పడు నీ ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది" అన్నారు. భోగాలను ఆశాపాశాలను వీడితే సమానచిత్తం కలిగితే బ్రాంతి బలహీనమౌతుంది. ఒకసారి ఊహాజగత్తులోకి ప్రవేశిస్తే తిరిగి బయటకు రావటం అసాధ్యం. అది నిద్రావస్థలో నడవటం వంటిది. ఒక ఊహ నుండి మరో ఊహ ఒక భ్రమ నుండి మరో భ్రమ ఒక తప్ప నుండి మరో తప్ప జనిస్తుంది. చివరకు మిగిలేది నిస్పృహ. భగవంతుని ఇంటి ఆవరణలో కాలుపెట్టాలంటే మన వాసనలు అనే కుక్కలు పేట్రేగి మన మీద విరుచుకుపడతాయి. భగవంతుని స్మరణ వదలకపోతే అవి తోక ముడిచి వెళ్ళిపోతాయి. సద్భావనలోంచే శక్తి వస్తుంది. ఆ భావనాశక్తే చైతన్యంగా మారిపోతుంది. ప్రారబ్ధం అనుభవించటంలో పాండవుల విషయం తీసుకుందాము, ఇంద్రప్రస్థ నగరము ధృతరాష్ట్రునివంటి రాజుకు ఈర్ష్య కలిగించే స్థితిలో వైభవంగా జీవించారు. పొంగు పోలేదు. మరోసారి అజ్ఞాతంలో విరాట్ పర్వంలో సేవకులుగా ఉన్నా కృంగిపోలేదు. దాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. సూత్రాలు ఆచరణలో పెట్టాలి. ప్రకృతి ఒక తల్లి, ఒక గురువు, ఒక శిక్షకుడు మనం ఏమి నేర్చుకోవాలో అది నేర్చుకోవటానికి తగినటువంటి పరిస్థితిని ఏర్పరుస్తుంది. దాన్ని మనం నేర్చుకోలేము. ప్రకృతి మూర్ఖురాలు కాదు. గురువుకు ఉన్న శక్తులు అన్నీ ఉన్నాయి. అది మనలను ఒకచోటకు చేర్చి కొంత సమయం ఇస్తుంది. ఒక విశేషమై సమస్య పరిష్కారాలు వెదుక్కోవటానికి అంటే ఒక అతీతశక్తి మనలను నడుపుతోందనే విషయం గ్రహించక మిగతావి అన్నీ చేస్తూ చిందులు తొక్కుతాము ఎందుకు వచ్చింది ఈ దుర్గతి అని. దాన్ని గురువు ఇచ్చిన వరదానంగా భావించి విషయాన్ని గ్రహించాలి. లెక్కలు సరిగా చేస్తే పై తరగతిలోకి వెళతాము. అహంకారమంటే ఏమాత్రం సంతృప్తి ఎరుగనిది. ఒక సరళ రేఖనైనా సరిగ్గా గీయలేదు. తనకు తాను ఒక చక్రవర్తిగా భావించుకొంటుంది. దానికి తృప్తిలేదు. మన దుఃఖానికి మనమే మూలకారణమని ఒకసారి అర్థమైనదంటే సగం దుఃఖం ఒక్కసారి మాయమౌతుంది. అలా చెయ్యని పద్ధతిలో మనమే పతనమై అధోగతిపాలౌతాము. పనికిరాని పాశాలు ఉన్నంతవరకూ మనం పశువులమే. డబ్బు, అందం, వయస్సు అనే పాశాలతో పశుపతి మనలను బంధించాడు. ఎప్పడు నిర్వేదన పూర్వకమైన వైరాగ్యం కలుగుతుందో ఆ క్షణంలో, పాశాలు జారి పశుత్వంపోయి, పరబ్రహ్మమై ఆనందంతో ఉంటాము అంటారు అనుభవజ్ఞులు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**